# నూతన కలెక్టర్ భవేష్ మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** నిర్మల్ జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ భవేష్ మిశ్రాను జిల్లా ఎస్పీ డా. జి. జానకీ షర్మిల, ఐపిఎస్ ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలోని వారి చాంబర్‌లతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఎస్పీ డా.జి. జానకీ షర్మిల ఐపిఎస్‌తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపిఎస్ , ఇన్స్‌పెక్టర్లు మల్లేష్, సమ్మయ్య, ఆర్. ఐ రాం, నిరంజన్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్

ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 29 ఏప్రిల్, 2026 | పేజీలు :06


# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు. రానున్న ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాల నియంత్రణ, సన్న వడ్ల, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు, ఫార్మర్స్ రిజిస్ట్రీ పూర్తి తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన, సహకార, పోలీస్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో రూపొందించిన సన్న వడ్ల రకాలు, ఆయిల్ పామ్ సాగు పూర్తి వివరాలతో రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా ఏ విధమైన నకిలీ విత్తనాలు విక్రయాలు, కంపెనీ వివరాలు లేకుండా విడిగా విత్తనాల అమ్మకాలు చేయకుండా వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా దాడులు చేయాలని, ఏమైనా విక్రయాలు ఉంటే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నేరుగా వచ్చి విత్తనాలు విక్రయించే వారి వద్ద రైతులు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఫార్మర్స్ రిజిస్ట్రీ ఇప్పటిదాకా 73 శాతం పూర్తి చేశారని వెల్లడించారు. వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలు, రైతులను నేరుగా కలిసి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సన్న వడ్లు సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాప్ లు, రెసిడెన్షియల్ విద్యాలయాలు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. అలాగే రూ. 500 బోనస్ కూడా ఇస్తుందని వెల్లడించారు. జిల్లాలోని రైతులు సన్నవడ్లు సాగు చేసేలా.. యాజమాన్య పద్ధతులు తెలిపి ప్రోత్సహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, పంట సాగుకు రైతులు ముందుకు వచ్చేలా వివరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా కలిసి మాట్లాడాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ అధికారులకు 500 ఎకరాలు, మండల వ్యవసాయ అధికారులకు 50, ఏఈఓ లకు 30, ప్రతి పీఏసీఎస్ బాధ్యులు 120 ఎకరాల చొప్పున లక్ష్యంగా నిర్ణయించి.. ఆయిల్ పామ్ సాగుకు రైతులు డీడీలు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే చెల్లించిన వారికి డ్రిప్ ఇరిగేషన్, మొక్కలు అందజేసి నాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



## రైల్వే గేటు మూసివేతతో రాకపోకలకు

# ఇబ్బంది కలగకుండా చర్యలు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో రైల్వే రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంకు రైల్వే గేట్ మూసివేయడానికి తీర్మానం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్, పాలకవర్గం ఆమోదించారు. మంగళవారం మున్సిపల్ చైర్మెన్ మొలగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయం లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ భారతీయ రైల్వే సాధారణ నియమాలను అనుసరించి లెవెల్ క్రాసింగ్ లను తొలగించి రద్దీ నియాత్రణ చేయు లక్ష్యంతో సౌత్ సెంట్రల్ రైల్వే జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మడిపల్లి క్రాస్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణంను చేయుటకు గేటు మూసివేయడానికి కౌన్సిల్ సభ్యులు ముందు తీర్మాణం సమర్పించగా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పనులు పూర్తి చేసిన పిదప మాత్రమే రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును మూసివేయుటకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించిన్నట్లు చైర్మెన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇట్టి ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన వివరాలు సెంట్రల్ రైల్వే జోన్ ఖాజీపేట వారికి డిపీఆర్, ఇతర వివరాలు మున్సిపల్ కార్యాలయంలో అందించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపాలిటీ అభివృద్ధి మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి.రాజిరెడ్డి, టిపివో శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వాణీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల నరేష్ మాట్లాడుతూ, ఇటీవల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం మరియు కొందరు సీనియర్ నాయకులు పార్టీ నియోజకవర్గ నాయకత్వంపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.పార్టీ కల్పించిన అవకాశాలు, పదవులను అనుభవించిన తర్వాత నాయకత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు.జెట్టి లింగం ముందుగా పట్టణ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆయనకు పలుమార్లు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పించినప్పటికీ ప్రజల మద్దతు పొందలేకపోయారని పేర్కొన్నారు. అలాగే ఇతర నాయకులకు కూడా కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు.మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అనేక మందికి ఉన్నత పదవులు ఇచ్చి గౌరవించిందని, ఆ పదవులను అనుభవించిన తర్వాత పార్టీ నాయకత్వంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. తమ నాయకుడు జువ్వాడి నర్సింగారావు నాయకత్వం బలంగా ఉందని, ఆయన నాయకత్వంలోనే కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు సాధించిందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం జువ్వాడి నర్సింగారావు ఉన్నత మంత్రివర్గంతో సమన్వయం చేసుకుని నిధులు తీసుకొస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు పందిరి రమేష్, నునుగొండ నరేష్, కాజా అజీమ్, మాసుల ప్రవీణ్, రిబ్బాస్ మహేష్,గుడికందుల అజయ్,కోఆప్షన్ సభ్యులు పొన్నాల మాధవరెడ్డి,గజం లక్ష్మి రవి, మహమ్మద్ రజాక్ అబ్దుల్ హఫీస్,పెంట ప్రణయ్. బర్ల వంశీ. పలువురు పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ రుణాల అభ్యర్థులకు మౌఖిక పరీక్షల నిర్వహణ



**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ (ఎస్సీఎపి 2025–26) ద్వారా వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల స్థాయి కమిటీ ఆధ్వర్యంలో ధృవీకరణ పత్రాల పరిశీలన మరియు మౌఖిక పరీక్ష (ఇంటర్వ్యూ) నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈ ప్రేమ్ సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈవీ 2వీలర్, ఈవీ 3వీలర్,సోలార్ పంపుసెట్లు,అగ్రి అలైడ్,పాడి గేదెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను కమిటీ సభ్యులు ఇంటర్వ్యూ చేశారు. అభ్యర్థుల అర్హతను బట్టి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఐకేపీ ఏపీఎం ఎ. రవి వర్మ, నర్సింగాపూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్, గుండి గోపాలరావుపేట యూబీఐ మేనేజర్, బతికేపల్లి టీజీబీ మేనేజర్ మరియు బూరుగుపల్లి బ్యాంకు మేనేజర్లు పాల్గొని అభ్యర్థుల ఆర్థిక స్తోమత,రుణాల చెల్లింపుపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కార్యాలయ సిబ్బంది, దరఖాస్తుదారులు ఈ ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**ప్రజాపక్షం/పెగడపల్లి :** పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలకు ఉపశమనం కలిగించేలా మండలంలోని మద్దులపల్లి,రాములపల్లి గ్రామాలలో సర్పంచ్లు వెల్మ బలరాం రెడ్డి,అమిరిశెట్టి లక్ష్మి నారాయణ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంగళవారం గ్రామ పరిధిలో పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఆయన మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్లు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నందున కూలీలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పని సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,వడదెబ్బ తగలకుండా తరచూ మంచినీరు, మజ్జిగ తీసుకుంటూ శరీరాన్ని హైడ్రేటెడ్గా ఉంచుకోవాలని కోరారు. ఉపాధి పనుల వద్ద నీడ సౌకర్యం ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు పెంటల తిరుపతి, బాదినేని మధుకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, శివప్రసాద్, ఏఎన్ఎంలు కేతలక్ష్మి ,రజిత,ఆశ వర్కర్ వీణ,ఫీల్డ్ అసిస్టెంట్ రజిత,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన జిల్లా ఉపాధ్యక్షుడు చోప్పరి



**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చల్ల శంకరి లక్ష్మి ల మనవరాలు ఐరాని (వినోద్ కుమార్ శిరీషల కుమార్తె) మొదటి పుట్టిన రోజు,కర్ణవేదన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బుచ్చంరావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్,మాజీ సర్పంచ్ తూటి రజిత రఫీ తో పాటు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నమోదైన ప్రతి కేసును సమగ్ర విచారణ చేపట్టాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నమోదైన ప్రతి కేసును సమగ్ర విచారణ చేపట్టి నిందుతులకు శిక్షలు పడే విధంగా కృషి చేయాలని,పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలనీ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, పోలీస్ సిబ్బంది పనితీరును ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇప్పటివరకు నమోదైన కేసులు, పెండింగ్లో ఉన్న పాత కేసులపై ప్రత్యేకంగా దృష్టి సాధించాలన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రాసిక్యూషన్లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను తప్పించుకుని తిరుగుతున్న నిందితులపై పకడ్బందీగా అమలు చేయాలనలన్నారు. దొంగతనాల నివారణ,కేసుల ఛేదనపై సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని కేసులు చేదించి రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తు ప్రజలను, వ్యాపారస్థులను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, సి.ఐ లు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్తో కలిగే దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో జిల్లాలో నమోదవుతున్న ఎన్డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రచారంలాంటి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే కర్మకాండ నిలయ భవనాలను నిర్మిస్తాం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్లో నాలుగు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించి అందుబాటులోకి తేవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గానికి సూచించారు. స్మశాన వాటికలకు సమీపంలో ఈ కర్మకాండ నిలయాలను నిర్మిస్తే బాగుంటుందని, ఎవరూ ఇలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్ లో చాలా చోట్ల కిరాయి ఇండ్లలో నివసిస్తున్న కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి అంత్యక్రియలు ముగిసే వరకు ఇంటి యజమానులు రానివ్వని దుస్థితి నెలకొంది. అసలే సొంత ఇల్లు లేని పేదలు అప్పటిదాకా లాడ్జీల్లో బస చేసేంత ఆర్థిక స్తోమత ఉండదు. అట్లాగని ఇంట్లోకి వెళ్లలేరు. కొంత మంది బంధువుల ఇండ్లకు వెళితే, కొంతమంది కర్మకాండ ముగిసే వరకు స్మశాన వాటికల్లో భార్యాపిల్లలతో బతుకు వెళ్లదీయాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొంటున్నాయి. కేంద్ర మంత్రి సూచన మేరకు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు వారం రోజుల క్రితం కరీంనగర్ లోని సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ రహదారుల్లోనున్న స్మశాన వాటికలను సందర్శించారు. ఆయా స్మశాన వాటికల సమీపంలో కర్మకాండ నిలయాలు నిర్మాణానికి అనువైన స్థలాలపై ఆరా తీశారు. అందులో భాగంగా మార్కండేయ నగర్ స్మశాన వాటిక, కరీంనగర్ ఓల్డ్ సిటీ కేబుల్ బ్రిడ్జి సమీపంలోని స్మశాన వాటిక, అల్కాపురి స్మశాన వాటిక సమీపం, జగిత్యాల రోడ్డులోని రేకుర్తి స్మశాన వాటిక, మంచిర్యాల రోడ్డులోని స్మశాన వాటికల సమీప స్థలాలను పరిశీలించారు. స్థలాల ఎంపిక పూర్తయితే జీ+1 పేరిట కరీంనగర్ నలు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించాలని నిర్ణయించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో నిధుల కొరత లేనందున సాధ్యమైనంత తొందర్లో స్థలాలను ఎంపిక పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో కర్మకాండ నిలయానికి రూ.50 లక్షల చొప్పున వ్యయం చేయాలని భావిస్తున్నారు. కరెంట్, నీటి వసతి, బస చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ ఈ కర్మకాండ నిలయాల్లో కల్పించనున్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ లో నలు దిక్కుల 4 కర్మకాండ నిలయాలను నిర్మించి ఆశ్రయం కల్పించాలనే ప్రతిపాదనలను రూపొందించినట్లు తెలిపారు. అతి త్వరలోనే స్థలాల ఎంపికను పూర్తి చేసి కర్మకాండ నిలయ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రతిభ కనబరిచిన కృష్ణవేణి పాఠశాల విద్యార్థిని



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం కు చెందిన శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని భీమన పెల్లి వేద రాష్ట్రస్థాయి వ్యాస రచన పోటీలో ద్వితీయ స్థానం సాధించి ప్రతిభ కనబరచారు. ప్రజ్ఞ వికాస తరంగిణి ట్రస్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీ పరమపూజ్య శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని పొందారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పల్లె రాజు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ విజయం పాఠశాలకు గర్వకారణమన్నారు. వేద ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించిన ఉపాధ్యాయులందరి కృషిని ఆయన అభినందించారు. ఈ విజయానికి కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని వేదకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** ఆయిల్ ఫామ్ సాగు రైతులకు దాయకమైన పంట అని పలాస వ్యవసాయం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ రానున్న వానాకాలం సీజన్ దృష్ట్యా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో అధిక యూరియా వాడకం తగ్గించి ఎకరానికి 3–4 బస్తాలు మాత్రమే వాడాలని,నానో యూరియా వినియోగం పై రైతులను అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్కుమార్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, ఏఈఓ వినోద్,రైతులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమం ద్వారా సన్నరకాల వరి సాగుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** కోడిమ్యాల మండలంలోని కోడిమ్యాల, పూడూరు, తిర్మలాపూర్ రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు.దీనిలో భాగంగా వచ్చే వానకాలం లో సన్నరకం వరి ని ఎక్కువ మొత్తం లో సాగు చేయాలని సూచించడం జరిగింది. బిపిటీ 5204 , తెలంగాణ సోనా , హెచ్ఎమ్ టి ,జై శ్రీరామ్,జగిత్యాల సన్నలు ,జెజిఎల్ 1798 , కెఎన్యమ్ 1638 వంటి సన్న రకాల గురించి శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నానో యూరియా మరియు ప్రకృతి వ్యవసాయం లో సాధిస్తున్న విజయగాధలను ప్రత్యక్షంగా చూపించడం జరిగింది. గురించి రైతులకు సందేశం ఇవ్వడం జరిగింది..ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి ,ఏఈవో లు రాజేష్, శ్రీలత , గ్రీష్మ ,తేజస్విని మరియు రైతులు పాల్గొన్నారు.

## నిరుపేద ఆడబిడ్డల కళ్యాణానికి అండగా గోలపు సదయ్య గౌడ్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** నిరుపేద ఆడబిడ్డల వివాహానికి అండగా నిలిచి తన సేవ ఉదారతను మరోసారి చాటుకున్నారు ఏ గోలపు సదయ్య గౌడ్. మంగళవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు లో గల ఎస్సీ నిరుపేద యువతుల వివాహాలకు ఏ గోలపు కుమార్ గౌడ్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు సదయ్య గౌడ్ అండగా నిలిచారు. చీర బియ్యం వితరణ చేసి తన ఉదారతను మరోసారి చాటుకున్నారు.ఈ సందర్భంగా ఏ గోలపు సదయగౌడ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలు మా యొక్క ట్రస్టు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాతరి ప్రభాకర్, న్యాతరి శ్రీనివాస్,రాజ్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మైదంబండన అభివృద్ధి చేస్తాం

**ప్రజాపక్షం/ముత్తారం :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో మైదంబండ గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోంది.స్థానిక సర్పంచ్ శివ కుమార్ ప్రత్యేక చొరవతో, ప్రభుత్వం నుంచి అందుతున్న నిధులను సమర్ధవంతంగా వినియోగిస్తూ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు.పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనేసి.సి రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల ఆధునీకరణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గ్రామంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సర్ప ంచ్ శివ కుమార్ మాట్లాడుతూ, మంత్రి శ్రీ ధర్ బాబు మార్గదర్శకత్వంలో మైదంబండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడ మే మా లక్ష్యం.ముఖ్యంగా గ్రామస్తులకు మె రుగైన సౌకర్యాలు కల్పిస్తూ, గ్రామాన్ని ఒక మోడల్ విలేజ్‌గా మారుస్తాం అని ధీమా వ్య క్తం చేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పంట ధ్వంసం



**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లి లో షార్ట్ సర్క్యూట్‌తో భూమయ్య అనే అనే రైతు యొక్క మొక్క జొన్న పంట ఒక ఎకరం వరకు పూర్తిగా కాలి ద్వంసం కావడం జరిగింది. చేతికి వచ్చిన పంట పూర్తిగా నాషనం కావడంతో రైతు కుటుంబం ఆవేదనతో దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాడు. రైతుకు ప్రభుత్వం ద్వారా తగిన నష్టపరిహారం అందించాలనిని, అధిరుకారులని మరియు గ్రామ పెద్దలను కోరారు.

## రైతులు వరితో పాటు ఇతర లాభదాయక పంటలపై దృష్టి సారించాలి

### సుల్తానాబాద్ ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రైతులు వరితో పాటు ఇతర లాభదాయక పంటలపై దృష్టి సారించాలని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నారాయణపూర్, కోదురుపాక, దేవునిపల్లి, చిన్నకల్వల, రెబ్బల్లేపల్లి, పెరిక ప ల్లి, మియాపూర్, చిన్న బొంకూర్ తదితర గ్రామాలలో ఏ ర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు వారితో పాటు ఇతర లాభదాయక పంటలపై దృష్టి సారించాలని, ప్రభుత్వం ఏర్పాటు చే సిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, మ్యాచర్ వచ్చేవరకు కల్లాల వద్ద ఆరబెట్టి సెంటర్ కు ధాన్యాన్ని తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత , సంఘ ఇన్చార్జి మహమ్మద్ ముఫాసిర్ అహ్మద్,అసిస్టెంట్ రిజిస్టర్ వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో చైర్మన్లు దేవరనేని మోహన్ రావు,శ్రీగిరి శ్రీనివాస్,సీఈవో వల్లకొండ రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, నాయకులు,,ట్యాబ్ ఆపరేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన 'మేడే' జెండా ఎగురవేయాలి

### ఎరవెల్లి ముత్యంరావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామ గ్రామాన మేడే జెండాను ఎగరవేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. మంగళవారం 140 వ మేడే కరపత్రాలను సుల్తానాబాద్ రైస్ మిల్ అసోసియేషన్ కెనాల్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను జిల్లాలోని కార్మిక వర్గం గ్రామ గ్రామాన పతాకావిష్కరణతో సంఘటితశక్తిని ప్రదర్శించాలని విజ్ఞప్తి చేశారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసి యజమానులకు లాభం చేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తెచ్చిందని, దీనితో 8 గంటల పని విధానం 12 గంటలకు మారుతుందని, ఈ ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ మేడే జరుపుకోవాలని అన్నారు. 140 సంవత్సరాల క్రితం ఎనిమిది గంటల పని దినం అమలు కోసం పోరాడి ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులను స్మరించుకుంటూ ఎనిమిది గంటల పని దినం హక్కును కాపాడుకుంటామని ప్రతిన భూనాలని అదే చికాగో అమరులకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి ఉపయోగపడే కార్యక్రమాలు ఏమి చేయకపోగా ఉన్న హక్కులను, చట్టాలను, అందుకు మొత్తం కార్మిక వర్గం జెండా ఆవిష్కరణలు,ప్రదర్శనలు, సభలు ద్వారా తమ యొక్క ఆకాంక్షను వెలుబుచ్చాలని, అందుకు సమయం ఆసన్నమైందని కావున జిల్లాలోని కార్మిక వర్గం మొత్తం ఈ మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, కో కన్వీనర్ మాతంగి రాజమల్లు, మహేందర్, విలాస్, రవీందర్, అబ్బాస్, నవీన్, రఘుపతి రెడ్డి, ప్రభాకర్, వేణు,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/రామగిరి :** వేసవి కాలంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం అన్నారు.ప్రతి సంవత్సరం నిర్వహించే వేసవి శిక్షణలో భాగంగా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆర్.జీ3 & ఏ.పి.ఏ ఏరియా ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి గాను 18 సంవత్సరాలలోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ఈనెల 29వ తేది నుంచి 25 రోజుల పాటు స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు వాలీ బాల్, ఫుట్ బాల్, ఆర్చరీ (విలువిద్య), హాకీ మొదలగు క్రీడల్లో ఉచిత వేసవి శిక్షణ ఇవ్వడం జరుతుందని, ఇట్టి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరని, ఈ శిక్షణ శిబిరాన్ని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని అధికార ప్రతినిధి బి.సుదర్శనం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఆసక్తి ఉన్న 18 సంవత్సరాల లోపు సింగరేణి ఉద్యోగుల పిల్లలు తమ పేర్లను క్రీడల సమన్వయకర్త అంజయ్య, సెల్ నెంబర్ 9581318029 వద్ద నమోదు చేయించుకోవాలని అన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో మందుబాబుల వీరంగం



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలోని ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆకతాయిలకు అడ్డాగా మారింది.అర్ధరాత్రి సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మద్యం సేవించడమే కాకుండా,మద్యం సీసాలను కిటికీల గుండా లోపలికి విసిరి పగలగొట్టారు.ఈ ఘటనలో అంగన్‌వాడీ కేంద్రం కిటికీలు ధ్వంసమయ్యాయి.ఇలాంటి సంఘటన జరగడం ఇది నాలుగోసారి కావడంతో స్థానికులు,అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి సూచన మేరకు.. ఉపసర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, గ్రామ కార్యదర్శి బుర్ల రాజేందర్,అంగన్‌వాడీ టీచర్ మధుమతి కలిసి ముత్తారం ఎస్సై రవికుమార్ ని ఆశ్రయించారు. ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై సానుకూలంగా స్పందించారు.ముఖ్యంగా ఆకతాయిల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని,ఒకవేళ ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతమైతే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవికుమార్ హెచ్చరించారు. చిన్నారులు విద్యనభ్యసించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు.మంగళవారం సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి గ్రామంలో సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ చొప్పరి శైలజ అంజన్నలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్,మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కిసాన్ సెల్ అధ్యక్షుడు పన్నాల రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ రావు, గ్రామ ఉపసర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు సహకార సంఘం ప్రత్యేక అధికారి తో పాటు సీఈవో సంతోష్ హమాలి కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## హోం గార్డును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

**ప్రజాపక్షం/రామగిరి :**గోదావరిఖని ఎన్టిపిసి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న అనారోగ్యంతో బాధపడుతున్న రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన హోంగార్డు నక్క నగేష్ ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వీరి వెంట టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## 30న ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ 202526 కింద వివిధ యూనిట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 30 వ తేదీ ఉదయం 10 గంటలకు ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఇంటర్వ్యూకి వచ్చే రోజు తమ వెంట తెచ్చుకోవాల్సిన పత్రాలుఆన్లైన్ దరఖాస్తు కాపీఆధార్ కార్డు,రేషన్ కార్డు,లేటెస్ట్ ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలుపట్టాదార్ పాస్ బుక్ (వ్యవసాయ రంగానికి)డ్రైవింగ్ లైసెన్స్ (ట్రాన్స్‌పోర్ట్ రంగానికి)పాన్ కార్డు,బ్యాంక్ పాస్ బుక్పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలన్నారు. అలాగే అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్ ఒక ప్రకటనలో కోరారు.

## రైతులు సాగులో మెళుకువలు పాటించాలి శాస్త్రవేత్తలు టి. అర్చన

**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులు సాగులో మెళకువలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. మంగళవారం ముత్తారం మండలం మైదంబండ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి శాస్త్రవేత్తలు టి. అర్చన (వ్యవసాయ విస్తరణ విభాగం), ఎస్. రమేష్ (కీటక విభాగం) హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వరిలో మేలైన రకాలు, అధిక ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలు, ఎరువులను వినియోగించే సరైన పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, ఆయిల్ పామ్ పంటలను ఆశించే చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె.అనూష,వ్యవసాయ విస్తరణ అధికారి జి.హారిక,గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల కార్మిక బాల్య వివాహాల పై అవగాహన చేసిన అధికారులు

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని మన్మద్ గ్రామంలో గ్రామ సర్పంచ్ జయ లలిత భోజన్న గ్రామస్తుల సమక్షంలో జి.పద్మావతి చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో మన్మద్ గ్రామంలో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు నిర్మూలన చేయాలని అందరూ సహకరించాలని తెలుపుతూ బాల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 నెంబర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. అశోక్ క్యాదర్శి మాలతి , ఆశా వర్కర్ మంజుల అంగాన్వాడి కే.పద్మ, సునిత గ్రామస్తులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కూచాడి శ్రీహరిరావుకు 'కాల్వ' లక్ష్మీ నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29,30 తేదీల్లో బుధ, గురు వారాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు మాజీ డిసిసి అధ్యక్షులు, నిర్మల్ నియోజక వర్గ కాంగ్రేస్ ఆర్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు గారిని మర్యాదూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంగూర్ మహేందర్ , ధర్మకర్త పూదరి శివ మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## డిపిఆర్‌ఒకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ అభినందనలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా పౌర సంబంధాల అధికారిగా ఏడుకొండలు ఇటీవల బాధ్యతలు స్వీకరించగా.. మంగళ వారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీపీఆర్‌ఓ ఏడుకొండలుకు గవర్నర్ ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కెజిబివిలో విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన


**ప్రజాపక్షం/ దిలావర్‌పూర్ :** వెల్ఫేర్ వీక్ కార్యక్రమాల్లో భాగంగా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో టీనేజ్ గర్భాధారణ, బాల్య వివాహాలు మరియు మత్తు పదార్థాల వినియోగంపై బుధవారం బారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్, ఐజాజ్ ఖాన్, మండల విద్యాధికారి సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తక్కువ వయసులో గర్భం దాల్చడం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యలను, సామాజిక ఇబ్బందులను విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాలు జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో వివరిస్తూ, చదువుపై ఏకాగ్రత వహించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుస్ప్రభావాల గురించి అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, ఎస్.ఐ. అపర్ణ, చైల్డ్ ప్రొటెక్షన్ టీం సభ్యులు



శైలజ, కరుణ తదితరులు పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. సదస్సు ద్వారా విద్యార్థినిల్లో చైతన్యం పెంపొందించడమే కాకుండా, వారి హక్కులు మరియు భద్రతపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులపై ఆంక్షలు తొలగించి, పూర్తి పంటను కొనుగోలు చేయాలి

### బి.ఆర్.ఎస్ నేత ఇ. చిన్నారెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మొక్కజొన్న పండించిన రైతులపై ప్రభుత్వం విధిస్తున్న కొనుగోలు ఆంక్షల పట్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు ఇ.చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పత్రికా ముఖంగా మాట్లాడుతూ, రైతులు ఎకరానికి దాదాపు 40 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తే ప్రభుత్వం కేవలం 26 క్వింటాళ్ళ 50 కేజీలు మాత్రమే కొనుగోలు చేస్తామని చెప్పడం సరికాదన్నారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడా అమ్ముకోవాలో అర్థం కాక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యల గురించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కౌలు రైతులకు రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం, ఇప్పుడు వారిని దళారుల చేతుల్లో పెట్టిందని విమర్శించారు. పొలం కౌలుకు ఇచ్చిన యజమానులు ఉద్యోగ రిత్యా హైదరాబాద్, బెంగళూరు మరియు విదేశాలలో ఉంటున్నారని అటువంటప్పుడు బయోమెట్రిక్ నిబంధన పెట్టడం వల్ల కౌలు రైతులు తమ పంటను అమ్ముకోలేక పోతున్నారని చిన్నారెడ్డి వివరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎటువంటి నిబంధనలు ఆంక్షలు లేకుంగడా, రైతులు పండించిన మొత్తం మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను నిండా ముంచే ఇటువంటి అనాలోచిత నిర్ణయాలను వెనక్కి తీసుకొని అన్నదాతలను ఆదుకోవాలని బి.ఆర్.ఎస్. పార్టీ తరపున ప్రభుత్వాన్ని కోరారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ నియోజకవర్గ నేతలు

**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్:** నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా ఈ రోజు బాధ్యతలు స్వీకరించిన శ్రీ భవేష్ మిశ్రా ఐఏఎస్ గారిని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు ప్రజా ప్రతినిధులు మరియు నియోజెక వర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో నాయకులు కలెక్టర్ గారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్ గారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధి పథకంలో కలెక్టర్ గారికి తమ వంతు సహాకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొనానరు. కలెక్టర్ గారిని కలిసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైరెట్మన్ అర్జుమంధ అలీ, ఏఎంసి చైర్మెన్ సోమ భీంరెడ్డి, సారంగాపూర్ ఏఎంసి చైర్మెన్ అబ్దుల్ హాదీ, మాజీ గ్రంథాలయ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్ ఇతర నాయకులు ఉన్నారు.

## ప్రయోజన పథకం (ఎన్.ఎఫ్.బి.ఎస్) సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బోథ్ :** జాతీయ కుటుంబ ప్రజల పథంలో భాగంగా అందూరు, ధన్నూర్‌బి గ్రామాలలో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి బోథ్ ఎంపిడిఓ యల్ రమేష్ విచారణ చేపట్టడం జరిగింది వారి వెంట సర్పంచ్‌లు పెందూర్ పృథ్వీరాజ్, రోహిణి వినయ్ రెడ్డి ఏ.పి.ఓ. జగదేవురావు, పంచాయతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ కుటుంబంలో ప్రధాన సంపాదకులు భర్త/భార్య మృతి చెంది మైనర్ పిల్లలు కలిగిన పేద కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రభుత్వం 20,000 తక్షణ సహాయం అందజేయనుంది అని తెలిపారు. ఇటీవల కుటుంబంలోని ప్రధాన సంపాదకులు మరణించనట్లయితే ఈ పథకం కింద మీ సేవలో అప్లై చేసుకుంటే విచారణ జరిపి అర్హులుగా గుర్తిస్తే డి.ఆర్.డి.ఓ. కలెక్టర్ ఆనుమతితో సెర్ప్ సీఈఓ కి పంపించి ఆమోదం తీసుకోవడం జరుగుతుంది ఆమోదం పొందిన అనంతరం లబ్ధిదారుని అకౌంట్లో నేరుగా 20 వేల రూపాయలు జమ కావడం జరుగుతుంది అని తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో ఇండ్లకు నష్టం జరగకుండా చూడాలి

### ముత్తారం రోడ్డు విస్తరణ - బాధితుల ఆవేదన

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల వల్ల తమ నివాస గృహాలు,వ్యాపార సముదాయాలకు భారీగా నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతూ, బాధితుల కుటుంబాలు ఆదివారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు, స్థానిక సర్పంచ్ సూదాటి రవీందర్ రావు తోపాటు తదితర ప్రజాప్రతినిధులకు విన్నవించుకుంటున్నారు. రోడ్డు వెడల్పు పనుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల ఇండ్లు కూలిపోయే అవకాశం ఉందని, తమకు నిలువ నీడ లేకుండా చేయవద్దని బాధితులు నాయకులను వేడుకున్నారు.ఉన్న ఇళ్లకు కనీస నష్టం జరగకుండా రోడ్డు అలైన్మెంట్‌ను మార్చాలని లేదా వెడల్పును కొంత మేరకు కుదించాలని బాధితులు ప్రతిపాదించారు.బాధిత కుటుంబాలు తమ గోడును స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లగా,వారు సానుకూలంగా స్పందిస్తూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.రోడ్డు విస్తరణ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, కానీ తమ జీవనాధారమైన ఇళ్లను, షాపులను కాపాడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం కుంటాల :** రాజ్యాంగంలోని అన్ని వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కే దక్కుతుందని సర్పంచ్ మెట్టు రాజు అన్నారు. మంగళవారం మండలంలోని దౌనెల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలోని అంటరానితనాన్ని నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషిని మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముదుకెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయినాథ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్.పి. చైర్మెన్ జుట్టు అశోక్, ఐ.కె.ఆర్. పి.ఏ. నాలం శ్రీనివాస్ మాజీ సర్పంచ్. హైమద్ పాషా, మాజీ డిసిసి డైరెక్టర్ తుర్పాటి వెంకటేష్, జుట్టు మహేదర్, మగ్గిడి దిగంబర్, కరుణాకార్, శ్రావణ్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## భైంసాలోని డాక్టర్ అసోసియేషన్ భవనంలో కీర్తశేషులు డాక్టర్ సురేందర్ శ్రద్ధాంజలి

**ప్రజాపక్షం / భైంసా:** భైంసా పట్టణంలో డాక్టర్స్ అసోసియేషన్ ఐఎంఎ భైంసా ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. డాక్టర్ సురేందర్ ఈ ప్రాంతంలో చేసిన వైద్య సేవలు ప్రజల మనసుల్లో ఎపన్పటికి నిలిచిపోతాయని ఆయన లేని లోటు వైద్య రంగానికి తీరని నష్టమని డాక్టర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సలో ఏదైన ఆటంకం కలిగినప్పుడు వెంటనే స్పందించి తోటి డాక్టర్లకు సహాయం చేసే గొప్ప మనసున్న వైద్యుడిగా ఆయనను స్మరించుకున్నారు. వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃశాన్ని భరించే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా డాక్టర్స్ అసోసియేషన్ మరియు ఐఎంఎ భైంసా సభ్యులందరూ పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచండి

### కలెక్టర్‌ని కలిసిన కాంగ్రెస్ పార్టీ బృందం



**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచి రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ని కాంగ్రెస్ పార్టీ బృందం మంగళవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీసం ప్రతి మండలానికి రెండు సపెంటర్ల చొప్పున ఏర్పాట్లు చేసి జొన్నలు కొనుగోలుతో పాటు తరలింపుకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పాఱ్టీ జిల్లా అధికార ప్రతినిధి పనుల చంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మహ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు పన్నాల శమేందర్ రెడ్డి, కుమ్మరి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు అధికారులు

**ప్రజాపక్షం నిర్మల్ రూరల్:** జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్‌మిశ్రాను పలువురు అధికారులు, మంగళ వారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో నతన కలెక్టర్‌ను , జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, పలువురు జిల్లా అధికారులు వివిద శాఖల అధికారులు, ఉద్యోగులు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కలు పుష్పగుచ్చాలు అందించారు. శాలువాతో సన్మానించారు. తమని తాము కలెక్టర్‌కు పరిచయం చేసుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## ద్విచక్ర వాహనం వేలం

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలోని అబ్కారి కార్యాలయంలో ఒక ద్విచక్ర వాహనం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గుండప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని మద్య నిషేధ, ఆబ్కారీ స్టేషన్ లో స్క్రాప్ ఉన్న ఒక ద్విచక్ర వాహనం ఉందన్నారు. వచ్చే నెల 5వ తేదిన ఉదయం పది గంటలకు ఈ ద్విచక్ర వాహనానికి వేలం పాట నిర్వహిస్తున్నామని గుండప్ప తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో హాజరై 25శాతం ఈఎండి చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని ఎక్సైజ్ శాఖ సిఐ గుండప్ప తెలిపారు.

## పోస్టాఫీస్ ల్యాండ్ సమస్యపై కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : భీమ్‌గల్ పట్టణ ప్రజలు ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్న కల నెరవేరేందుకు గత సంవత్సరంలో సర్వసమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన నీలం రవి కృషితో పట్టణంలో పోస్టాఫీస్ కార్యాలయం నిర్మించాలని డిమాండ్ చేయగా దీనికి స్పందించిన అప్పటి జాయింట్ కలెక్టర్ తహసీల్దార్‌కు పోస్టాఫీస్‌కు సంబంధించిన ల్యాండ్‌ని సరెండర్ చేయాలని ఆదేశించిన ఇప్పటివరకు చేయకపోవటంతో కౌన్సిలర్ నీలం రవి మంగళవారం మండలంలోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు కలిసి ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన కలెక్టర్ తహసీల్దార్‌కు నిర్లక్ష్యం చేయకుండా ల్యాండ్‌ని సరెండర్ చేయాలని అధికారికి ఆదేశించారు.

## కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ కమీషనర్ గోపు గంగాధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లారీలు కొరత ఉండటంతో లారీ కొరత లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రైస్‌మిల్లులతో మాట్లాడి వరి లోడైన లారీలను త్వరగా ఖాళీ చేసి కొన్ని కొనుగోలు కేంద్రాలకు పంపేలా చూడాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. రైతులతో మాట్లాడి లారీల కొరత లేకుండా చూస్తామన్నారు. దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేయాలని రైస్‌మిల్ యజమానులకు ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట మెప్మా సిబ్బంది ఉన్నారు.

# వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయండి

### సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలి...

### మహిళలు, పిల్లల భద్రతపై ఎస్.ఐ. ఉషారాణి...



ప్రజాపక్షం/మంచిర్యాల: వేధింపుల విషయంలో మహిళలు, విద్యార్థినీలు అప్రమత్తంగా వ్యవహరిస్తు వెంటనే ఫిర్యాదు చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా వేంపల్లి ఎస్‌ఆర్‌కెఎం నర్సింగ్ కళాశాల నర్సింగ్ విద్యార్థులకు, మహిళలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా షీ టీం ఇంచార్జి ఎస్ఐ ఉషరాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలకు, పిల్లలకు అవగాహన సదస్సులను ఏర్పాటు రామగుండం సిపి, మంచిర్యాల డిసిపి భాస్కర్ పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రధానంగా విద్యార్థులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పని ప్రదేశాలలో, బహిరంగ ప్రదేశాలలో మహిళలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్స్ వాట్సప్ నంబర్ 6303923700 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడుతాయని బాధితులు ఎలాంటి భయం లేకుండా ముందుకు రావాలని ఎస్ఐ హైమ కోరారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్‌మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల మహిళలు, విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనట్లయితే వెంటనే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమాజ అభివృద్ధికి లింగ సమానత్వం కీలకమని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ్‌కుమార్, అధ్యాపక బృందం, మంచిర్యాల షీ టీం సిబ్బంది , కానిస్టేబుళ్ళు శ్రవణ్, వనిత, శ్రీలత, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# ఎబివిపి ఆధ్వర్యంలో ఉచిత పెరుగన్నం పంపిణీ



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల పట్టణానికి సుదూర ప్రాంతాల నుండి వస్తున్న వారి ఆకలి తీర్చాలనే ఉద్దేశ్యంతో అఖిల భారత అయ్యప్ప భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో ఉచిత పెరుగన్నంను పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఎలుక సంతోష్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల ఐబి చౌరస్తాలో ఉచిత పెరుగన్న పంపిణీ కార్యక్రమం ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచిర్యాల ఐబి చౌరస్తాలో వేసవికాలంలో ప్రతి రోజు పెరుగన్న పంపిణీ చేస్తామని దాతలు సహకారం వల్లనే తమ కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాలు అయ్యప్ప స్వామి భక్తులు ఉచిత పెరుగన్నంతో పాటు మంచినీటిని పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, తిరుమలరావు, కార్పోరేటర్ మాదంశెట్టి సత్యనారాయణ, దొంతుల ముఖేష్, కటుకం హరీష్, ఎబివిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్, బొడ్డు లచ్చన్న, కార్యదర్శి మధుసూధన్, కోశాధికారి బేతి సత్యనారాయణ, కార్యదర్శి సిరిపురం రాజేశ్, పిఆర్ఓ భాస్కర్ల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ భయం... పెట్రోల్ బంకుల వద్ద క్యూలు

ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల వల్ల దేశంలో ఇంధన కొరత ఏర్పడవచ్చనే పుకార్లు సోషల్ మీడియాలో షికారు చేస్తున్నాయి. ఈ భయాందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు పోటెత్తుతున్నారు. ముందస్తు జాగ్రత్తగా తమ వాహనాల ట్యాంకులను ఫుల్ చేయడమే కాకుండా ప్లాస్టిక్ క్యాన్లలో నింపుకొని ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. దీని వల్ల డిమాండ్ పెరిగి కొన్ని ప్రాంతాల్లో బంకులు మూతపడటంతో సామాన్యులు మరింత ఆందోళన చెందుతున్నారు.

**ఫుల్ ట్యాంక్ ప్రమాదకరం...**

పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలు త్వరగా వ్యాకోచిస్తాయి.. ట్యాంక్ పూర్తిగా నిండి ఉంటే, గాలి ఆడేందుకు చోటు లేక ఒత్తిడి పెరిగి ఇంధనం లీక్ అయ్యే అవకాశం ఉంది. ట్యాంకుల్లో గ్యాస్ పేరుకుపోయి చిన్న నిప్పు రవ్వ తగిలినా వాహనం పేలిపోయే ప్రమాదం ఉ ది. ఎండలో వాహనాన్ని పార్క్ చేసినప్పుడు ట్యాంక్ నిండుగా ఉంటే మూత నుంచి పెట్రోల్ బయటకు వచ్చే ప్రమా దం ఉంది. ఇది ట ర్ర వద్ద ఉండే వేడికి లేదా ఇంజిన్ వేడికి అంటుకుంటే భారీ అగ్ని ప్రమాదం జరుగుతుంది.

**ఇళ్లలో నిల్వ చేయడం మరింత ప్రమాదం...**

చాలామంది క్యాన్లలో పెట్రోల్ తెచ్చి ఇళ్లలో నిల్వ చేస్తున్నారు. పెట్రోల్ అత్యంత మండే స్వభావం గల పదార్థం సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద కూడా అది ఆవిరవుతుంది. మూసి ఉన్న గదుల్లో ఈ ఆవిర్లు చేరితే ఇంట్లోని విద్యుత్ స్విచ్‌లు లేదా వంటింట్లోని మంట వల్ల ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం ఉంది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం మిన్న. ఇంధన కొరత ఉంటుందన్న భయంతో ట్యాంకులు ఫుల్ చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అగ్ని మాపక అధికారుల సూచనలు చేస్తున్నారు.

## మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క బుధవారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారంపరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి పాల్గొననుండగా కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఓ సాయన్న, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీడబ్ల్యుఓ పద్మ ఉన్నారు.

## కుల గణనలో నేతకానిలకు తీవ్ర అన్యాయం

ప్రజాపక్షం/నేరడిగొండ: గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణనలో నేతకానిలకు తీవ్ర అన్యాయం జరిగిందని నేతకాని కుల సంఘం మండల అధ్యక్షుడు అల్లూరి భానుచందర్ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకాని సమాజాన్ని లెక్కలోకి తీసుకోకుండా జనగణన చేయడం, రాష్ట్రంలో 12 లక్షలకుపైగా జనాభా 40 నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న విషయాన్ని మర్చిపోవడం పట్ల ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రభుత్వం నేతకానిలపై సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తూ భారీ కుట్ర చేసిందని విమర్శించారు. నాయకులు శ్రావణ్, సుధాకర్, భీమన్న, గంగాధర్, ప్రవీణ్, రవీందర్, అడెల్లు, ప్రవీణ్, రాజేశ్వర్, స్వామిపాల్గొన్నారు.

## చిన్నవయసులో గర్భదారణ ప్రమాదకరం




ప్రజాపక్షం/నేరడిగొండ: బాలల భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని సావర్గం, గుత్పాల గ్రామాలలో బాల్య వివాహాలపై ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు వివాహాలు చేయడం చట్టపరంగా నేరమని, చిన్న వయసులో గర్భదారణ జరిగితే తల్లి బిడ్డలకు ప్రమాదకరంగా మారుతుందని తెలిపారు. మొదట చదువుపూర్తైన తర్వాత వివాహం అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం స్నేహ బృందాల కార్యకలాపాలు, పోక్సో చట్టం, 1098, 181 నంబర్ల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శేఖర్, సోషల్ వర్కర్ నిఖిలేశ్వర్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీ భీమ్రావ్, ఉపసర్పంచ్ లింగంపల్లి రమ సురేష్, ఐకెపి సీసీ, ఆశా కార్యకర్త, డిహెచ్‌ఈడబ్ల్యూ, ఎస్‌ఎఫ్‌ఎల్, ఐసిపిఎస్ ప్రతినిధులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భానుడి భగభగలు.. వాహనదారులు జాగ్రత్త




ప్రజాపక్షం/ఎడపల్లి: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగి 40 నుంచి 46డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంటున్నాయి. సోమవారం నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలో 46డిగ్రీల రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతల నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే ఒకవైపు ఎండలు మండుతుంటే, మరోవైపు అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ప్రజలు చేస్తున్న పొరపాట్లు ప్రాణాల మీదకు తెచ్చేలా ఉన్నాయి.

# వాహనదారులు పాటించాల్సిన నియమాలు



ప్రజాపక్షం/ఎడపల్లి: పెట్రోల్ ట్యాంకులో కనీసం పది నుంచి 15శాతం ఖాళీగా ఉండాలి. దీని వల్ల ఇంధనం వ్యాకోచించడానికి గాలి అందుబాటులో ఉంటుంది. సాధ్యమైనంత వరకు వాహనాలను నీడలో పార్క్ చేయాలి. నేరుగా ఎండ తగిలే చోట ఎక్కువ సేపు ఉంచొద్దు. కార్లలో గాలి ప్రసరణ కోసం కిటికీ అద్దాలను కొంచెం దించి ఉంచడం వల్ల లోపల వేడి పెరగకుండా ఉంటుంది. కారు లోపల లైటర్లు, పెర్ఫ్యూమ్ బాటిళ్లు, శానిటైజర్లు ఉంచకండి. ఎండ వేడికి ఇవి పేలిపోయే అవకాశం ఉంది. అంతర్జాతీయ పరిణామాల వల్ల ఇంధన కొరత ఏర్పడుతుందనేది ప్రస్తుతానికి కేవలం భయం మాత్రమే అని, ఆ భయంతో ప్రమాదకరమైన ఎండల్లో సాహసాలు చేయవద్దని అధికారులు కోరుతున్నారు. మీ ప్రాణం మీ చేతుల్లోనే ఉంది. అప్రమత్తంగా ఉండండి అని సూచిస్తున్నారు.

## ప్రాణం తీసిన ఈత సరదా

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** వేసవి తాపానికి చల్లని నీటిలో స్నేహితులతో కలిసి ఈత కొడదామన్న ఆ యువకుడి సరదా అతడి ప్రాణాలనే తీసింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా కేంద్ర శివారులోని మంజీరా డ్యాంలో చోటు చేసుకుంది. ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన గొల్లంకి గణేష్ (25) ఈ నెల 26 సాయంత్రం కల్పగూరు గ్రామ పరిధిలోని మంజీరా డ్యామ్‌కి తన స్నేహితులతో కలిసి వచ్చాడు . సాయంత్రం డ్యాంలోని నీటిలో దిగి ఈత కొట్టేందుకు ప్రయత్నించారు. ఈత సరిగా రాకపోవడంతో ఆ నీటిలో కొట్టుకుపోయాడు. ఈ విషయం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో ఈ నెల 27 న అతడి మృతదేహాన్ని బయటికి తీయించారు. అయితే మృతి చెందిన యువకుడు ఇస్నాపూర్ పరిధిలోని పెన్నాకోర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉంటే ఓ వైపు పోలీసులు నీటి ప్రవాహాల వైపు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నా కూడా కొందరు పట్టించుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

### 98 శాతం ఫోన్లు రికవరీ

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పోగొట్టుకున్న ఫోన్లను పాపన్నపేట పోలీసులు 98 శాతం రికవరీ చేసి బాధితులకు అప్పగించి శభాష్ అని పించుకుంటున్నారు. జిల్లాలోని రికవరీలో పాపన్నపేట పోలీసులు ముందు ఉండడం విశేషం, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షణలో సిఈఐ ఆర్ ఇంచార్జ్ పోలీస్ నాన్ సింగ్ ఆధ్వర్యంలో ఫోన్లను చాకచక్యంగా పట్టుకుంటున్నారు. ఇటీవల వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న 11 సెల్ ఫోన్లు సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా రికవరీ చేసి, మంగళవారం ఠాణాలో బాధితులకు ఫోన్లు అందజేశారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్ పరిధిలో 509 ఫోన్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై మానవహారం

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై మండల అధికారులు, విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనార్థాలు, ఇబ్బందులను అర్థమయ్యేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుకర్ రెడ్డి, డాక్టర్ సాయిసౌమ్య, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఐకెపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా కట్టుదిట్టమైన చర్యలు

### కలెక్టర్ ప్రతీక్ జైన్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ .జైన్ అధికారులను ఆదేశించారు. ప్రతి నివాస ప్రాంతానికి నిరంతరం త్రాగునీటి సరపరా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గ పరిదిలోని మండలాల ఎంపిడిఒలు ,హౌసింగ్ ఆర్‌డబ్యూల ఎస్‌ఏలు ఎంపిఓలు మున్సిపల్ కమీషనర్ విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, ఇందిరమ్మ, ఇండ్లు, శానిటేషన్, సాదాబైనామాలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి అంశాలపై వివరింగా చర్చించారు. మండలాల వారీగా గ్రామాల్లో నీటి సరపరా పరిస్థితి అందుబాటులో ఉన్న నీటి వనరులు మరమ్మతులు అవసరమైన పనులపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వేసవి లో సమస్యల ఎదురైన ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని ప్రతి ఇంటికి త్రాగునీరు, అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు తెలెత్తితే ముందుగానే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వచ్చి యుద్ధ ప్రాతిపాదకను పరిష్కరించాలని సూచించారు . ఈ సమావేశంలో నారాయణఖేడ్, సబ్ కలెక్టర్ ఉమా హారతి ,మున్సిపల్ కమీషనర్ , ఎంపిడిఓలు తహసీల్దార్లు, ఎంపిఓలు, విద్యుత్ హౌసింగ్ మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

### మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు సేకరిస్తామని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం వర్గల్ మండల కేంద్రంలో సర్పంచ్ జయభారతి, పిఎసిఎస్ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ జితేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ గోవర్ధన్ రెడ్డితో కలసి ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వరి ధాన్యాన్ని నిబంధనలతోపాటు ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. ముఖ్యంగా ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షం పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు తగు జాగ్రత్త తీసుకోవాలని కోరారు. అవసరమైన ప్రతిచోట ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండగా, వాటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సన్నధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మధ్య దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని వివరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ మెంబర్లు, నేతలు పొన్నాల నర్సారెడ్డి, అరవింద్ రెడ్డి, పాషా, పరశురాం, పాల్గొన్నారు.

# చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులు చేయాలి

### పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి డిమాండ్




**ప్రజాపక్షం/గజ్వేల్ :** మున్సిపల్ పరిధిలో నిరుపయోగంగా ఉన్న చెత్త సేకరణ వాహనాలను వెంటనే మరమ్మతు చేయాలని పిసిసి కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు కౌన్సిలర్లు, నేతలతో కలిసి ఆయన వాటిని పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్‌పై భారం పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. చెత్త సేకరణలో డబ్బులు వసూలు చేస్తే పాలక మండలి నవ్వుల పాలు అవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్థిక భారంతో ఇబ్బంది పడుతున్న గజ్వేల్ మున్సిపల్ యంత్రాంగం ఖర్చులు తగ్గించి ప్రజలపై భారం మోపకుండా వనరులు సమకూర్చుకోవాలని తెలిపారు. చిన్నచిన్న మరమ్మతులు చేపట్టకుండా వాహనాలను పక్కన పడేస్తే తుప్పు పట్టే ప్రమాదం ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని వాటి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, మామిడి శ్రీధర్, కాముని మురళి, రొట్టెల శ్రీనివాస్, నేతలు మన్నె వెంకటేశం, నక్క రాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు నిర్మూలిద్దాం

### డిఆర్డీఎ పీడీ శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** బాల్య వివాహాలను నిర్మూలించాలని డీఆర్డిఏ పీడీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్క్ లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బాలల భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. మానవహారం చేపట్టి బాల్య వివాహం బతుకు ఆగం మొదలగు స్లొగన్స్ చెప్పించడం జరిగింది. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఆ తర్వాత నర్సాపూర్ రైతు వేదిక నందు బాలల భద్రత కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సిఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ కు యువత దూరంగా ఉండాలని సూచించారు అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, సిఐ జాన్ రెడ్డి, ఎంపీడీవో మహమ్మద్ మొజాం హుస్సేన్, ఎస్సై రంజిత్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ రఘువరన్, ఎంఈఓ తారా సింగ్, ఏపిఎం సంగమేశ్వర్, కౌన్సిలర్లు, సూపర్వైజర్లు శివకుమారి, సంతోషి మాత, మెహత, మెప్మా సిబ్బంది, డ్వాక్రా గ్రూపు సీసీలు, కిశోర బాలికలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.



## కో-అప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతం

**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక మున్సిపాలిటీ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక మంగళవారం ప్రశాంతంగా జరిగింది. మున్సిపాలిటీ చైర్ పర్సన్ సంగీత అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో నలుగురిని కో ఆప్షన్‌సభ్యులను ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. పరిపాలన అనుభవం కోటాలో గోనెపల్లి దేవలక్ష్మి ఆస యాదయ్య, మైనారిటీ కోటాలో ఎండి. ఖలీల్, ఎండి నసీం సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారు చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సభ్యులకు శాలువ కప్పి సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సులోచన స్వామి తదితరులు ఉన్నారు.

## రాజక్కపేట అంగన్‌వాడీ ముందు ధర్నా

**ప్రజాపక్షం/దుబ్బాక :** దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ 1 వద్ద తల్లిదండ్రులు, గ్రామస్తులు పిల్లలతో కలిసి ధర్నా చేపట్టారు. ఇటీవల కుళ్లిపోయిన కోడి గుడ్లు తిని పిల్లలు అనారోగ్యానికి గురైన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిడిపివో ఎల్లయ్య ఆధ్వర్యంలో అధికారులు తనిఖీ చేయగా కుళ్లిపోయిన ఆహార పదార్థాలు ఉన్నట్లు గుర్తించి అంగన్‌వాడీ టీచర్, కార్యకర్తకు షోకాజ్ నోటిసులు జారీ చేశారు. కలెక్టర్, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహంవ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. గ్రామ సర్పంచ్ జోక్యంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామి ఇవ్వడంతో ధర్నా విమరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి : బాలేష్‌గౌడ్

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :** పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు ఉపయోగడే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసే కుట్రలకు పాల్పడుతుందని బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్‌గౌడ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ , స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎబివిపి ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 48 గంటల నిరాహార దీక్షకు బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మంగళవారం సంఘీభావం ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రియంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బాకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి బిజెపి ఉద్యామాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కెమ్మసారం వెంకట్, సునీల్, గందె సంతోష్,యాదగిరి,లక్ష్మారెడ్డి,మహెందర్,ఎబివిపి నాయకులు ఆదిత్య,పవన్,పరుశరాములు, ఫణిందర్ పాల్గోన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పాపన్నపేట :** మద్యం మత్తులో క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నాగ్సాన్ పల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు గ్రామానికి చెందిన కాగితాల జహంగీర్ (39) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వస్తున్నాడు. తాగుడుకు బానిస మారడంతో చిన్నపాటి అప్పులు పెరిగి అవి ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సమయంలో మద్యం సేవించి ఓ దావత్ లో భోజనం చేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి బయటే నిద్రించాడు. మంగళవారం ఉదయం పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అటుగా వెల్లిన స్థానికులకు కనిపించాడు. స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి తల్లి షాబేరా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.